క్లుప్తంగా

సెల్‌ఫోన్ అప్పగింత



ఆత్మకూర్: మండలంలోని జూరాలకు చెందిన వడ్ల అంజనేయులు ఈనెల 3వ తేదీన జూరాల నుంచి ఆత్మకూర్‌కు బైక్‌పై వస్తుండగా సెల్‌ఫోన్ పడిపోయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్ ఆచూకీని కనుక్కొని రికవరీ చేసినట్లు పోలీసులు తెలిపారు. శనివారం బాధితుడికి ఫోన్ అప్పగించినట్లు ఎస్ఐ నరేందర్ పేర్కొన్నారు. సెల్‌ఫోన్లు చోరీకి గురయిన, లేదా పోగొట్టుకున్న సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వివరాలను పొందుపర్చాలని సూచించారు.

కస్తూర్బాలో చెత్త తొలగింపు



ఆత్మకూర్: మండలంలోని బాలకిష్టాపూర్ కస్తూర్బా పాఠశాలలో పేరుకుపోయిన చెత్త, చెదారాన్ని శనివారం పంచాయతీ సిబ్బంది తొలగించారు. శుక్రవారం సాయంత్రం మక్తల్ ఎమ్మెల్యే వాకిటిశ్రీహరి ఆకస్మికంగా సందర్శించి పాఠశాల ఆవరణలో పేరుకుపోయిన చెత్తా చెదారం చూసి కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈనేపథ్యంలో గ్రామకార్యదర్శి మహబూబ్‌ఖాన్ ఆధ్వర్యంలో చెత్తను తొలగించడంతో పాటు ప్రతినిత్యం సిబ్బందితో కలిసి కార్యక్రమాన్ని చేపడుతామన్నారు. కార్యక్రమంలో ఎస్ఓ శివలీల తదితరులు ఉన్నారు.

వీధికుక్కల తరలింపు



ఆత్మకూర్: మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో వీధికుక్కల తరలింపును చేపడుతున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు అన్నారు. శనివారం గుంటూరుకు చెందిన వారితో వీధికుక్కలను పట్టిస్తున్నామని, పట్టిన వీధి కుక్కలను అచ్చంపేట నల్లమల అడవుల్లో వదులుతున్నారని తెలిపారు. ఇందుకుగాను ఒక్క కుక్క పట్టేందుకు రూ.300ల చొప్పున చెల్లిస్తున్నామని, ఇది వరకు 150కుపైగా వీధికుక్కలను పట్టుకున్నారని మరో నాలుగు రోజుల్లో పూర్తిస్థాయిలో కార్యక్రమాన్ని పూర్తి చేస్తామన్నారు.

ప్రధాన కాల్వలపై కంపచెట్లు తొలగించండి



వీపనగండ్ల: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న జూరాల, భీమా కాల్వల ప్రధాన కట్టలపై కంపతార చెట్లు ఏపుగా పెరగడంతో కాల్వల సమీపంలోని పంట పొలాల రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. గోపల్‌దిన్నె రిజర్వాయర్ మొదలుకొని సంగినేపల్లి, తూంకుంట, సంపత్‌రావుపల్లి, వీపగండ్ల గ్రామాల ప్రధాన కాల్వలు, మైనర్, సబ్‌మైనర్ కాల్వల వెంట కంపతార చెట్లు ఏపుగా పెరిగాయని, అలాగే భీమా కాల్వ 16వ ప్యాకేజీలో పుల్గర్‌చర్ల, కల్వరాల, సంగినేనిపల్లి తదితర గ్రామాల్లోని ప్రధాన కాల్వలపై ఉన్న కంపతార చెట్లను ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి పరిశీలన జరిపి తొలగించాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

హైమాక్స్ లైట్‌కు మరమ్మతు

పెబ్బేరు రూరల్: మండలంలోని సూగూరు బస్టాండ్ ప్రాంతంలో చాలా రోజుల నుంచి హైమాక్స్ లైట్ రిపేర్‌లో ఉండడంతో.. బస్టాండ్ సమీపం చీకటిగా మారింది. ప్రజల విజ్ఞాపన మేరకు స్థానిక కాంగ్రెస్ నాయకుడు షన్ముఖి స్పందించి సొంత డబ్బులతో ఐమాక్స్ లైట్‌కు మరమ్మతు చేయించారు. ఈ సందర్భంగా ఆయనను ప్రజలు, యువకులు అభినందించారు. కార్యక్రమంలో వెంకటేష్, హర్ష, మంగలి కుమార్, గొల్ల పెద్దహుస్సేన్, ఇబ్రహీం, మండగిరి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



పశువైద్యం అందని ద్రాక్షే



సంకిరెడ్డిపల్లిలో పశువులకు వైద్యసేవలు చేస్తున్న ఇన్‌చార్జ్ సిబ్బంది (ఫైల్)

- వేధిస్తున్న సిబ్బంది కొరత
- కొన్ని గ్రామాలకే పరిమితమైన సేవలు
- అవస్థల్లో పాడిరైతులు, కాపరులు

కొత్తకోట రూరల్: ఉమ్మడి జిల్లాలోనే విస్తీర్ణం పరంగా, జానాభా పరంగా అతిపెద్ద మండలం కొత్తకోట. ప్రస్తుతం 22గ్రామ పంచాయతీలున్న మండలంలోని పశువైద్యశాలల్లో కనీస వసతులు కూడా లేవు. పక్కా భవనాలు లేకపోవడం, సిబ్బంది కొరత వేధిస్తుండటంతో మండలంలో పశువులకు వైద్యం కొన్ని గ్రామాలకే పరిమితమైంది. 96,875 గొర్రెలు, 6,223 ఆవులు, ఎద్దులు, 5,600 గేదెలు, 12,500 కోళ్లు, 6,100 మేకలు ఉన్న మండలంలో రెండు పశువైద్య కేంద్రాలు, మరో మూడు గ్రామీణ పశువైద్య ఉప కేంద్రాలు మాత్రమే ఉండటంతో అన్నదాతలకు, పాడిరైతులు, యాదవులకు అవస్థలు తప్పడం లేదు.

మండలంలో పశువైద్య కేంద్రాలు ఇవే..

మండలంలో కొత్తకోట, అప్పరాల గ్రామాల్లో మాత్రమే ప్రాథమిక పశువైద్య కేంద్రాలు ఉన్నాయి. అందులో మిరాసిపల్లి, అమడబాకుల, సంకిరెడ్డిపల్లి గ్రామాల్లో ఉపకేంద్రాలు ఉన్నాయి. కొత్తకోట, అప్పరాల గ్రామాల్లో పశువైద్య కేంద్రాలు ఉండగా.. కొత్తకోటలో మాత్రమే ప్రభుత్వ డాక్టర్ ఉన్నాడు. అప్పరాలలో గతంలో కాంట్రాక్టర్ డాక్టర్ ద్వారా సేవలు అందించారు. ప్రస్తుతం అప్పరాల పశువైద్య కేంద్రంలో డాక్టర్ లేకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉప కేంద్రాల్లో ఇన్‌చార్జ్‌లతో కాలం వెళ్లదీస్తున్నారు.

సిబ్బంది కొరత

మండలంలో మూడు పశువైద్య ఉప కేంద్రాల్లో



పామాపురంలో ప్రారంభానికి నోచుకోకుండానే శిథిలావస్థకు చేరుకున్న పశువైద్య కేంద్రం

ముగ్గురు (ఎల్ఎస్ఏ) లైవ్ స్టాక్ అసిస్టెంట్లు ఉండాలి. కానీ ప్రస్తుతం ఒకరు మాత్రమే మిరాసిపల్లి ఉప కేంద్రంలో పనిచేస్తుండగా సంకిరెడ్డిపల్లి, అమడబాకుల ఉపకేంద్రాల్లో ఇద్దరు ఎల్ఎస్ఏలు కావాల్సి ఉంది. అమడబాకులలో పశువైద్య ఉపకేంద్రంలో వేరే మండల ఏఎస్ఏ ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్నారు. అమడబాకుల పశువైద్య భవనం శిథిలావస్థకు చేరుకుంది.

వైద్యానికి దూరంగా గ్రామాలు

మండలంలోని రాణిపేట, పామాపురం, కనిమెట్ట, పాతజంగమాయపల్లి, చర్లపల్లి వడ్డెవాట, రామకృష్ణాపురం, నాటవెళ్లి గ్రామాలు మండలంతో సంబంధం లేకుండా ఉంటాయి. ఉపకేంద్రాలు ఉన్న చోటకు వెళ్లాలంటే రోడ్డు సౌకర్యం ఉన్నప్పటికీ పశువైద్య సేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి మండల విస్తీరణం దృష్టిలో ఉంచుకుని మండలానికి మరో 8పశువైద్య ఉపకేంద్రాలు పక్కాభవనాలు, సరిపడా సిబ్బందిని నియమించి అన్నదాతల కష్టాలు తీర్చాలని మండల వాసులు కోరుతున్నారు.

డాక్టర్‌ను నియమించండి



మా గ్రామానికి దాదాపు మూడు గ్రామాల నుంచి వైద్యం కోసం పశువులు, గొర్రెలు, మేకలను తీసుకోస్తుంటారు. ఇప్పుడు గ్రామానికి మంగళవారం, శుక్రవారం మాత్రమే ఎల్ఎస్ఏ వస్తున్నారు. మిగతా రోజులు కంపోండరే డాక్టర్‌గా విధులు నిర్వహిస్తాడు. పర్మినెంట్ డాక్టర్ నియమించాలని కోరుతున్నాం.

– కొల్లంపల్లి యాదవ్, అమడబాకుల

ఇన్‌చార్జ్‌లతోనే నెట్టుకొస్తున్నారు



గ్రామంలో పశుసంపద ఎక్కువగా ఉంది. పశువుల దవఖాన ఉన్నప్పటికీ డాక్టర్ లేకపోవడంతో ఇన్‌చార్జ్ ఎల్ఎస్ఏతో పనిచేయిస్తున్నారు. ఆయన కూడా ఎప్పుడు వస్తాడో తెలియదు. కంపోండర్ పశువులకు వైద్యం చేస్తాడు.

– ఎం.రాజు, సంకిరెడ్డిపల్లి

ప్రారంభానికి నోచుకోలే..



26 ఏళ్ల క్రితం మా గ్రామంలో పశువుల దవఖానా కోసం భవనాన్ని నిర్మించి వదిలేశారు. ఇప్పటి వరకు ప్రారంభానికి నోచుకోలేదు. డాక్టర్‌ను నియమించలేదు. సుమారు 15 కిలోమీటర్లు వెళ్లి పశువులకు వైద్యం చేయించాలి. ఈ భవనం కూలిపోకముందే ప్రారంభించి కొత్తగా డాక్టర్ నియమించాలని కోరుతున్నాం.

– దాసరి చిన్న భీమన్న, పామాపురం

ఇబ్బందులు పడుతున్నాం



నేను మిరాసిపల్లిలో ఎల్ఎస్ఏగా పనిచేస్తున్నాను. సంకిరెడ్డిపల్లి ఇన్‌చార్జ్ ఎల్ఎస్ఏగా వారంలో రెండు రోజులు వెళ్లి వస్తాను. సీజన్ సమయంలో చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇక్కడ పశుసంపద ఎక్కువగా ఉంది. ఉన్నతాధికారులు పర్మినెంట్ డాక్టర్‌ను నియమిస్తే బాగుంటుంది.

– రవీందర్‌రెడ్డి, లైవ్ స్టాక్ అసిస్టెంట్

నిందితులను కఠినంగా శిక్షించాలి



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

పెబ్బేరు రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నంద్యాల జిల్లా ముచ్చుమరికి చెందిన ఐదేళ్ల బాలికపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఏఐఎస్ఎఫ్ , ఏఐవైఎఫ్ ,భారత జాతీయ మహిళా సమాఖ్య నాయకులు డిమాండ్ చేశారు. శనివారం వనపర్తి పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, భారత జాతీయ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో చిన్నారిని అత్యాచారం, హత్య చేసిన ముగ్గురు మైనర్ల దిష్టిబొమ్మలను దహనం చేశారు. గల్లంతైన బాలిక శవాన్ని వెంటనే గుర్తించాలని, మైనర్లను కఠినంగా శిక్షించాలని, ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ ఏపీ హోంమంత్రి అనిత రాజీనామా చేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎత్తం విష్ణు, చంద్రశేఖర్, అరవింద్, గణేష్, చరణ్, అశోక్, బన్ని, బాలు, శివ, హిళా నాయకురాలు వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు

కొత్తకోట రూరల్: ముందు వెళ్తున్న బైక్‌ను వెనుక నుంచి కారు ఢీకొనడంతో బైక్‌పై ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన శనివారం కొత్తకోట ఎన్‌హెచ్44పై చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తకోట మండలం అప్పరాలకు చెందిన కురుమూర్తి, సంపత్ ఇద్దరు కలిసి బైక్‌పై కొత్తకోటకు వచ్చి పని ముగించుకుని తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా అమడబాకుల స్టేజీ సమీపంలో కర్నూల్ వైపు వెళ్లే కారు బైక్‌ను ఢీకొనడంతో బైక్‌పై ఉన్న సంపత్‌కు తీవ్రగాయాలు కాగా కురుమూర్తికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే అంబులెన్స్‌లో వనపర్తి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు.



కొత్తకోట ఎన్‌హెచ్44పై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులు

మహిళ అదృశ్యం: కేసు నమోదు

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రానికి చెందిన నాగలక్ష్మి అనే గృహిణి గత నెల 10న ఇంట్లో నుంచి వెళ్లిపోయినట్లు ఆమె తల్లి వెంకటలక్ష్మమ్మ కొత్తకోట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పట్టణ కేంద్రంలో నివాసం ఉంటున్న ఆకుల హరిప్రసాద్‌కు నాగలక్ష్మితో 15ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. అయితే నాగలక్ష్మి గత నెల 10న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. అయితే తల్లిగారి ఇంటికి వెళ్లిందని హరిప్రసాద్ అనుకున్నాడు. నాగలక్ష్మి నెల రోజుల నుంచి తల్లికి ఫోన్ చేయకపోవడంతో అనుమానం వచ్చి కొత్తకోటకు చేరుకుని హరిప్రసాద్‌ను నిలదీయడంతో అసలు విషయం బయటపడింది. దీంతో నాగలక్ష్మి గురించి బంధువుల వద్ద వెతికినా సమాచారం దొరకకపోవడంతో శనివారం కొత్తకోట పోలీస్ స్టేషన్‌లో వెంకటలక్ష్మమ్మ ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు.



ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైంది

పాన్‌గల్: మండలంలోని గోప్లాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను శనివారం గ్రామస్తులు, విద్యార్థులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. పాఠశాలలో పనిచేస్తూ పదోన్నతిపై వెళ్తున్న రజిత, గోవింద్, బదిలీపై వెళ్తున్న రామచంద్రయ్య, శ్రీనివాసులు, రాఘవేంద్ర, మంజులను ఘనంగా సన్మానించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ పాఠశాలల్లో విధులు నిర్వహించి విద్యా అభివృద్ధికి ఎంతో కృషి చేశారని వారు చేసిన సేవలు చిరకాలం గుర్తుంటాయన్నారు. సమావేశంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసులు, గ్రామ నాయకులు పుల్లారావు, చంద్రూనాయక్, రాణి, కృష్ణ, దశరథం , రాజాగౌడు, బాలకృష్ణ, కృష్ణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న హెచ్‌ఎం

ఫొటోగ్రాఫర్ల సమస్యలు పరిష్కరించాలి

ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం ఫొటోగ్రాఫర్ల సమస్యలు పరిష్కరించడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటిని వర్తింపచేయాలని ఫొటోగ్రాఫర్ల సంఘం అధ్యక్షుడు మణ్యం కోరారు. శనివారం ఆత్మకూర్ ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం సీఐ శివశంకర్, ఎస్ఐ నరేందర్ చేతులమీదుగా ఐడీ కార్డులను అందుకున్నారు. అధ్యక్షుడిగా మణ్యం, ఉపాధ్యక్షుడిగా నవీన శ్రీను, ప్రధానకార్యదర్శిగా తౌఫిక్, గౌరవ అధ్యక్షుడిగా శ్రీరాములు నియమించారు. కార్యక్రమంలో జగన్‌గౌడ్, ఆరేపల్లి శ్రీను, నర్సింహులు, ప్రసాద్, లక్ష్మణ్, నరేష్, రంజిత్, ఖాజీ ఉన్నారు.



స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌కు సన్మానం



సాక్షి, నెట్‌వర్క్: తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ నూతన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన శివసేనా రెడ్డిని జిల్లా కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జిల్లాలో క్రీడాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించి, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా ముందుండి నడిపించాలన్నారు. కార్యక్రమంలో అఖిలపక్ష ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్‌యాదవ్, నరేష్‌కుమార్‌రెడ్డి, యాదగిరిగౌడ్, శివకుమార్, నరేందర్‌గౌడ్, అక్కి శ్రీనివాసులుగౌడ్, మాజీ ఎంపీపీ మహదేవన్‌గౌడ్, సాయిబాబా, విజయ్ ఉన్నారు.

బాత్‌రూం డోర్లు లేక ఇబ్బందులు

వీపనగండ్ల: మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌లోని విద్యార్థుల కోసం నిర్మించిన బాత్‌రూంలకు డోర్లు లేకపోవడంతో విద్యార్థులు ప్రతి రోజు ఇబ్బందులు పడుతున్నారు. వివిధ ప్రాంతాల నుంచి విద్యను అభ్యసించేందుకు మండల కేంద్రానికి వచ్చిన విద్యార్థులకు బీసీ బాలుర హాస్టల్‌లో వసతి ఏర్పాటు చేసిన అధికారులు.. విద్యార్థులు ఉపయోగిస్తున్న బాత్‌రూం, మరుగుదొడ్లకు డోర్లు అమర్చడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. డోర్లు అమర్చాలని ఉన్నతాధికారులకు వివరించినా పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.



పోచమ్మ ఆలయ నూతన కమిటీ ఎన్నిక



అమరచింత: పట్టణంలోని పోచమ్మ ఆలయ నూతన కమిటీని శనివారం ఆలయ ఆవరణంలో ఎన్నుకున్నారు. కమిటీ నూతన అధ్యక్షుడిగా పోసిరిగారి విష్ణు, ఉపాధ్యక్షులుగా జింక రవి, రాజు, ప్రధాన కార్యదర్శిగా కురువ రఘు, కోశాధికారిగా తాటికొండ రమే ష్, సలహాదారులుగా పెద్ద కిష్టన్న, కురువ గోపి, పెద్ద విమలన్న, కొత్తబాయి కురుమన్న, ఫకీరన్న, మంగ వెంకటన్నతో పాటు పలువురిని సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈనెల 23న పోచమ్మ బోనాల ఉత్సవం సందర్భంగా ఆలయ ఆవరణంలో పారిశుద్ధ్య పనులతో పాటు భక్తులకు సౌకర్యాలు కల్పించేలా కృషి చేయాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు పోసిరిగారి విష్ణు కోరారు. నూతన కమిటీని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆయూబ్‌ఖాన్ శాలువాతో సత్కరించారు.

ద్విచక్రవాహనం చోరీ

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని బస్టాండు వెనకాల ఉంచిన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించిన ఘటన శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. బాధితుడి వివరాల ప్రకారం.. ఖిల్లాఘనపురం గ్రామానికి చెందిన వెంకటేష్ బస్టాండులో ఓ షాపును అద్దెకు తీసుకొని మొబైల్ షాపు నిర్వహిస్తున్నాడు. ప్రతి రోజు మాదిరిగానే శనివారం మధ్యాహ్నం సమయంలో మోటార్‌సైకిల్‌ను బస్టాండు వెనక వైపున ఉన్న రావి చెట్టు వద్ద పెట్టి షాపులో ఉన్నాడు. నాలుగు గంటల సమయంలో వెళ్లి చూడా మోటార్ సైకిల్ కనిపించలేదు. చుట్టూ వెతికినా సమాచారం తెలియకపోవడంతో చేసేది లేక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

దివ్యాంగ బాలుడికి వీల్‌చైర్ అందజేత

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని గ్రంథాలయం వీధికి చెందిన సాత్విక్ అనే ఆరేళ్ల బాలుడు పుట్టుకతోనే అంగవైకల్యం ఉండటంతో నడవలేని స్థితిలో ఉన్నాడు. బాలుడి తల్లిదండ్రుల కుటుంబ పరిస్థితిని 7వ వార్డు కౌన్సిలర్ నవీన్‌రెడ్డి దృష్టికి స్థానిక బీజేపీ కార్యకర్తలు తీసుకెళ్లారు. దీంతో వెంటనే స్పందించిన కౌన్సిలర్ నవీన్‌రెడ్డి సొంత ఖర్చులతో వీల్‌చైర్‌ను తెప్పించి శనివారం బాలుడి ఇంటికి వెళ్లి అందజేశారు. తమ కుమారుడికి వీల్‌చైర్ అందజేసేందుకు కృషి చేసిన స్థానిక బీజేపీ కార్యకర్తలకు బాలుడి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాంచంద్రారెడ్డి, కొమ్ము సురేష్, రాఘవేంద్రగౌడ్, మహేష్‌రెడ్డి, అశోక్‌గౌడ్, మహేష్‌చారి, వీరప్రభు, రవితేజ తదితరులు ఉన్నారు.



దివ్యాంగ బాలుడికి వీల్‌చైర్ అందజేస్తున్న కౌన్సిలర్ నవీన్‌రెడ్డి, బీజేపీ కార్యకర్తలు

బాధిత కుటుంబాలకు పరామర్శ

కొత్తకోట రూరల్: కొత్తకోట గ్రామ మాజీ సర్పంచ్ ధన్వాడ బాలసామి (85) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. అదేవిధంగా వివేకానంద కాలనీకి చెందిన పాకనాటి నిరంజన్ (55) శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందాడు. స్థానిక కాంగ్రెస్ నాయకుల ద్వారా సమాచారం తెలుసుకున్న దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి శనివారం కొత్తకోటకు చేరుకుని చనిపోయిన వారి మృతదేహాలపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రైతుబీమా చెక్కు అందజేత

పట్టణ కేంద్రంలోని అంబభవానీ కాలనీకి చెందిన దుప్పటి శ్రీనివాసులు 20రోజుల క్రితం మృతి చెందాడు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రైతుబీమా చెక్కు రావడంతో ఎమ్మెల్యే మృతుడి భార్య దుప్పటి నాగమ్మకు ఆ చెక్కును అందజేశారు. రైతుబీమా చెక్కు త్వరగా రావడానికి కృషి చేసిన అధికారులకు, స్థానిక కాంగ్రెస్ నాయకులకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మేస్త్రీ శ్రీనివాసులు, బోయేజ్, కృష్ణారెడ్డి, డాక్టర్ పీజే బాబు, ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి, రావుల కర్ణాకర్ రెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



నాగమ్మకు రైతుబీమా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

డబ్బులు అందక ఉపాధి కూలీల ఇబ్బందులు

పాన్‌గల్: మండలంలోని బుసిరెడ్డిపల్లిలో పనిచేస్తున్న ఉపాధి కూలీలకు కూలి డబ్బులు రెగ్యూలర్‌గా అందక ఇబ్బందులు పడుతున్నట్లు కూలీలు శనివారం పేర్కొన్నారు. వారం వారం అందాల్సిన డబ్బులు రెండు నెలలుగా అందకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని కూలీలు వాపోతున్నారు. ప్రతి నిత్యం 300 మంది కూలీలు పనులు చేస్తున్నామని, వారానికోసారి కూలి డబ్బులు చెల్లిస్తామని ఒక పక్క అధికారులు చెబుతున్నా క్షేత్ర స్థాయిలో మాత్రం అమలు కావడం లేదని, కూలి డబ్బులు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి డబ్బులు రెగ్యూలర్‌గా అందేలా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఏపీఓ కుర్మయ్యను వివరణ కోసం ప్రయత్నించగా ఫోన్ లిఫ్ట చేయలేదు.



డబ్బులు అందడం లేదని ఆందోళన చేస్తున్న ఉపాధి కూలీలు

అప్పారెడ్డిపల్లి-ఆముదంబండతండా రోడ్డు పనులు ప్రారంభం

ఖిల్లాఘనపురం: మండలంలోని అప్పారెడ్డిపల్లి నుంచి ఆముదంబండతండాకు పర్వతాపురం మీదుగా వేసే రోడ్డు పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. ఈ మట్టి రోడ్డును బీటీ రోడ్డుగా మార్చేందుకు గత ప్రభుత్వం పీఎంజీఎస్‌వై నిధులు రూ.4.70 కోట్ల నిధులను మంజూరు చేసింది. అదే విధంగా అప్పారెడ్డిపల్లి, పర్వతాపురం గ్రామాల మధ్య ఉన్న పెద్ద వాగుపై బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేశారు. పనులు వేగంగా చేపట్టాలని నాటి వ్యవసాయ శాఖమంత్రి నిరంజన్‌రెడ్డి 2021 జూన్ 8వ తేదీన శంకుస్థాపన చేశారు. కానీ టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు ప్రారంభించడంలో జాప్యం చేశారు. ఈ నెల 07న 'శంకుస్థాపనకే పరిమితం' అనే శీర్షికన సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీరాజ్ డీఈ ప్రమోద్ సదర్ కాంట్రాక్టర్ పై ఒత్తిడి తీసుకురావడంతో ఆయన పర్వతాపురం శివారులో పనులు ప్రారంభించారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలు, కంప చెట్లను హిటాచీ సాయంతో తొలిగిస్తున్నారు. పనులు ప్రారంభం కావడంతో అప్పారెడ్డిపల్లి, పర్వతాపురం, ఆముదంబండతండా తదితర గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



పర్వతాపురం శివారులో కంపచెట్లు తొలిగిస్తున్న హిటాచీ

నేడు పాన్‌గల్‌కు జాన్‌వెస్లీ రాక

పాన్‌గల్: మండల కేంద్రంలో సీపీఎం మండల కార్యాలయాన్ని ప్రారంభించేందుకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సభ్యుడు జాన్‌వెస్లీ, జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ ఆదివారం హాజరవుతున్నట్లు సీపీఎం మండల కార్యదర్శి బాల్యానాయక్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మండల పార్టీ కార్యాలయం ప్రారంభంతో పాటు పార్టీ జెండా ఆవిష్కరిస్తారన్నారు. మండల కార్యకర్తల సమావేశంలో పాల్గొని పార్టీ బలోపేతం చేయడానికి పలు సూచనలు, సలహాలు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు, పార్టీ అనుబంధ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సూర్యవంశం రాము పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మండల కార్యదర్శి బాల్యానాయక్

భోజనంలో నాణ్యత పాటించాలి

పెబ్బేరు రూరల్: నాణ్యత, పోషక విలువలు గల ఆహారాన్ని రోగులకు అందించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రమేష్ , గోపాకృష్ణ, డిమాండ్ చేశారు. శనివారం వనపర్తి జిల్లా ఆస్పత్రిని వారు సందర్శించారు. రోగులకు పెడుతున్న భోజనం, కూరగాయలు, స్టాక్ చేసిన నిత్యవసర సరుకులను పరిశీలించారు. ఆస్పత్రిలో భోజన ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడుతూ మంచి పోషకాహారం పెట్టాలని కోరారు. రోగులకు అన్నం, చపాతి మాత్రమే ఇస్తున్నారని, తాజా కూరగాయలతో ఆహారం సిద్ధం చేసి పెట్టాలన్నారు. ప్రతి రోగికి 300 గ్రాముల అన్నం లేదా రెండు చపాతీలు మాత్రమే ఇస్తున్నారని తినగలిగినన్ని పెట్టాలని గోపాలకృష్ణ అన్నారు. సరైన చర్యలు చేపట్టకపోతే రోగులతో కలిసి ఆస్పత్రి వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

